అధ్వాన రోడ్లను ఆధునికీకరించాలి

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మసూద్



పద్మశాలీకాలనీలో ప్యాచ్‌వర్కు పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మసూద్

ముషీరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లో అధ్వానంగా మారిన రోడ్లను వెంటనే ఆధునికీకరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలుతీసుకోవాలని భోలక్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మసూద్ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని డాక్టర్ వారీస్ ఆస్పత్రి వీధి, పద్మశాలీకాలనీలో జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టిన ప్యాచ్‌వర్క్ నిర్మాణ పనులను సయ్యద్ మసూద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇందిరానగర్, రంగానగర్, సిద్ధిక్‌నగర్‌లో పైప్‌లైన్ల నిర్మాణం అనంతరం పెండింగ్‌లో ఉన్న ప్యాచ్‌వర్కు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ దాస్, కాంగ్రెస్ నాయకులు ముజీబ్, కరీం తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి 8 వరకు దేవతా విగ్రహాల పునఃప్రతిష్ఠ



గోల్నాక డివిజన్ శంకర్‌నగర్‌లో మాట్లాడుతున్న రేణుకా ఎల్లమ్మ, ముత్యాలమ్మ, నల్లపోచమ్మ దేవాలయ కమిటీ ప్రతినిధులు, బస్తీ పెద్దలు

గోల్నాక, మే 25 (ఆంధ్రజ్యోతి): జూన్ 6 నుంచి 8వతేదీ వరకు గోల్నాక డివిజన్ శంకర్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ, ముత్యాలమ్మ, నల్లపోచమ్మ దేవతా మూర్తుల విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని భారీగా నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ తెలిపింది. ఈ మేరకు కమిటీ చైర్మన్ రావుల ప్రదీప్, అధ్యక్షుడు ఎ.బ్రహ్మాచారి, గౌరవాధ్యక్షుడు కె.శివరామకృష్ణ(రాజు), ప్రధానకార్యదర్శి టి.సతీష్, కోశాధికారి ఇ.పూర్ణచందర్, ఉపాధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్‌గుప్త ఆర్గనైజింగ్ సెక్రటరీలు కచ్చిగళ్ల శ్రీనివాస్, మురళీకుమార్, జాయింట్ సెక్రటరీ ఆనంద్, సభ్యులు ఎం.బల్‌దేవసింగ్, ప్రతాప్‌రెడ్డి, దీపు, బస్తీ పెద్దలు తదితరులు వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. అలాగే జూన్ 10వ తేదీన అమ్మవార్లకు భోనాలు నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు.

కవాడిగూడ బండానగర్‌లో మన్ కీ బాత్



కవాడిగూడ బండానగర్‌లో మన్‌కీబాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ సందేశాన్ని వింటున్న కార్పొరేటర్ జి.రచనశ్రీ, బీజేపీ నేతలు

కవాడిగూడ, మే 25 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ బండానగర్‌లో ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, నగర నాయకులు ఎంసీ.మహేందర్‌బాబు, డివిజన్ ప్రధానకార్యదర్శి ఏ.ప్రభాకర్ గంగపుత్ర, ఓబీసీ డివిజన్ మోర్చా అధ్యక్షుడు చిత్రకుమార్‌గౌడ్, బొల్ల రమేష్, అనిల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రచనశ్రీ మాట్లాడుతూ, దేశానికి డాక్టర్ కె.కస్తూరి రంగన్ చేసిన ప్రయోగాలు, దేశానికి చేసిన సేవలు నేడు ఉపయోగపడుతున్నాయని ప్రధాని పేర్కొన్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతవిధానంలోనే దోమలను నివారించాలి: కార్పొరేటర్



మస్కిట్ ఫాగ్ స్పెషల్‌డ్రైవ్, పిన్‌పాయింట్ కార్యక్రమాన్ని ఎంటమాలజీ సిబ్బందితో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణ కోసం పాతవిధానంలోనే చర్యలు తీసుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ సూచించారు. మస్కిట్ ఫాగ్ స్పెషల్‌డ్రైవ్, పిన్‌పాయింట్ కార్యక్రమాన్ని ఎంటమాలజీ సిబ్బందితో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. పాత పద్ధతిని కొనసాగిస్తూ రోజూ ఫాగింగ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

కనులపండువగా శ్రీనివాస కల్యాణం



శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహిస్తున్న పూజారి కృష్ణ తదితరులు

రాంనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): వైశాఖ బహుళ త్రయోదశమిని పురస్కరించుకుని రాంనగర్‌లోని జెమినికాలనీ పోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం శ్రీనివాస కల్యాణం కనులపండువగా జరిగింది. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు తిరుమల తిరుపతి నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన లడ్డూప్రసాదం, తులసీ మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి అఖిల భారత యౌవనస్థుల కూటములు

చిక్కడపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలో మంగళవారం నుంచి అఖిల భారత యౌవనస్థుల కూటములు జరుగుతాయని చర్చి స్థానిక దైవసేవకుడు జోసెఫ్ పి.కురియన్, చర్చి సొసైటీ చైర్మన్ జాన్ సుందరం, దైవసేవకులు ఎం.ఇమ్మాన్యుయేల్, డేవిడ్ తెలిపారు. ఈనెల 27 నుంచి జూన్ 1వ తేదీ సాయంత్రం వరకు కూటములు నిర్వహిస్తామన్నారు.

ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్‌కు మహర్దశ

రూ. 56లక్షలతో అభివృద్ధి పనులు

జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారులు

ముషీరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ముషీరాబాద్ వాలీబాల్‌గ్రౌండ్‌కు మహర్దశ రానుంది. 45 ఏళ్లనాటి బాలీబాల్ గ్రౌండ్‌ను మరింత ఆధునికీకరించేందుకు చర్యలు చేపట్టారు. గత సంవత్సరం అక్టోబర్ 26వ తేదీన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియానవీన్ గౌడ్ వాలీబాల్ గ్రౌండ్‌లో రూ.56లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎట్టకేలకు ఏడు నెలల అనంతరం పనులను ప్రారంభించారు.



వాలీబాల్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న పనులు

సౌకర్యాల ఆధునికీకరణ

ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్‌లో క్రీడాకారులకు మరింత సేవలు అందించేందుకు పనులు ప్రారంభమయ్యాయి. వాలీబాల్ గ్రౌండ్ చుట్టూ ప్రహరీ, సిట్టింగ్ గ్యాలరీ, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు నిధులను వెచ్చిస్తున్నారు. ఇప్పటికే సిట్టింగ్ గ్యాలరీకి పునాదులు తీశారు.

గ్రౌండ్‌కు ఘనమైన చరిత్ర

ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్‌కు ఘనమైన చరిత్ర ఉంది. ఈ గ్రౌండ్‌లో శిక్షణ పొందిన వారు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించారు. ఇండియా టీమ్‌కు ఆడిన వారిలో శ్రీలత, రాణిభానుతో పాటు జాతీయస్థాయి పోటీల్లో అనిత, సరిత, లత తదితరులు రాణించారు. మాజీమంత్రి సునితాలక్ష్మారెడ్డి సైతం చిన్నప్పుడు వాలీబాల్‌లో ఇక్కడే శిక్షణ పొందారు. నగరానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులకు ఇంటర్ స్కూల్ పోటీలను సైతం ఈ గ్రౌండ్‌లోనే నిర్వహించడం విశేషం. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా బీచ్ వాలీబాల్ సైతం కొనసాగుతోంది. గ్రౌండ్‌లో రెండు వాలీబాల్ కోర్టులు ఉన్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రౌండ్ కళకళలాడుతుంటుంది.



వాలీబాల్ గ్రౌండ్‌లో అభివృద్ధి పనులను ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్(ఫైల్)



ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్

రూ. 56లక్షలతో పనులు



వాటీబాల్ క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు గ్రౌండ్‌లో రూ.56లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించాం. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందీ తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. సిట్టింగ్ గ్యాలరీ, ప్రహరీ, ఓపెన్‌జిమ్, యోగా తదితర క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా గ్రౌండ్‌ను తీర్చిదిద్దుతున్నాం.

- సుప్రియా నవీన్‌గౌడ్, కార్పొరేటర్

క్రీడాకారులకు ఎంతో ఉపయోగం



వాలీబాల్ గ్రౌండ్‌లో దశాబ్ద కాలం తరువాత అభివృద్ధి పనులు చేపడుతున్నారు. క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గ్రౌండ్‌కు వచ్చేవారు సిట్టింగ్ గ్యాలరీలో కూర్చోడానికి అనుకూలంగా పనులు చేటడం అభినందనీయం.

- ఎండీ మోహిన్, స్థానికుడు

అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు



వాలీబాల్ గ్రౌండ్‌లో శిక్షణ పొందిన వారు ఇండియా టీమ్ తరుపున ఆడినవారు ఉన్నారు. ఉదయం, సాయంత్రం వేళ్లల్లో క్రీడాకారులకు ప్రత్యేకశిక్షణ ఇస్తున్నాం. అభివృద్ధిపనులు పూర్తి అయితే క్రీడాకారులకు మరింత ఉపయోగకరంగా ఉంటుంది.

- ఎం.బి.నర్సింహులు, సీనియర్ కోచ్

పంచముఖి మహాశివం ఆడియో ఆవిష్కరణ



సీడీని ఆవిష్కరిస్తున్న పార్వతీశం, కృష్ణకిశోర్ తదితరులు

చిక్కడపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): శంకరుడిని స్తుతిస్తూ ప్రముఖ వైద్యుడు, సర్జన్ డా.వరుణ్‌రాజ్ రూపొందించిన పంచముఖ మహాశివం ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం త్యాగరాయగాన సభలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇస్రో బెంగళూరు సీనియర్ సైంటిస్ట్, డైరెక్టర్ కృష్ణ కిశోర్ మాట్లాడుతూ పంచముఖ మహాశివం ఆలయం ఖాట్మండులో ప్రసిద్ధి చెందిన ఆలయం అన్నారు. సనాతనధర్మం మన దేశంలో ఉందంటే దానికి మూలకారణం ఆది శంకరాచార్య అన్నారు. పరమేశ్వరుడి అనుగ్రహం వుంటేనే అలాంటి మహనీయులు జన్మిస్తారన్నారు. శివాంశం అనేది మన దేశాన్ని రక్షిస్తోందని అందరూ తెలుసుకోవాలన్నారు. దేశాన్ని రక్షించిన వారందరూ దాదాపుగా శివభక్తులే అన్నారు. ధర్మాన్ని కాపాడాలనే ఆలోచన వారికి శివాంశం వల్లే వచ్చిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీకి కూడా శివాంశ ఉందన్నారు. వరుణ్‌రాజ్ వైద్యం, సర్జరీతోపాటు సంగీతంలో ప్రయోగాలు చేయడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డా.ఓలేటి పార్వతీశం, సంగీత కళాకారుడు ఉదయ్‌కుమార్, బుర్రా మోహనకృష్ణ, కర్ణాటక సంగీత బోధకురాలు గౌరీ పద్మావతి, జ్యోతిష్యపండితులు సూర్యనారాయణమూర్తి, యాళ్ల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీలోని పాటలను అతిథులు విడివిడిగా ఆవిష్కరించారు.

గండదీపం కవిత్వ పుస్తకం సబ్బండ కులాల గుండెదీపం



గండదీపం కవిత్వ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవి, డాక్టర్ అంబటి సురేంద్రరాజు, సీనియర్ జర్నలిస్ట్ రమేష్ హజారే, క్రైమ్ బ్రాంచ్ ఏసీపీ కె.కిరణ్‌కుమార్ ఆచార్యులు తదితరులు

రాంనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథుల పుష్పగిరి రాసిన గండదీపం కవిత్వ పుస్తకం సబ్బండ కులాల గుండెదీపమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విశ్వకర్మనాలెడ్జిసెంటర్ వార్షికోత్సవం కార్యక్రమం ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వనాథుల పుష్పగిరి, రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు శ్రీనివాసవిశ్వకర్మ, ప్రధానకార్యదర్శి సోలేటి ప్రభాకరచారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా గండదీపం కవిత్వ పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి కవి, డాక్టర్ అంబటి సురేంద్ర రాజు, సీనియర్ జర్నలిస్ట్ రమేష్ హజారే, క్రైమ్ బ్రాంచ్ ఏసీపీ కె.కిరణ్ కుమార్ ఆచార్యులు తదితరులు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తక రచయిత సామాజిక పదచిత్రాలతో గండదీపం వెలిగించారని పేర్కొన్నారు. ఒక ఉత్పత్తి, జీవన విధానం, సంస్కృతి కవిత్వంగా వెలువడిందన్నారు. ఈ కార్యక్రమంలో కేఎన్.ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి కె.గణేషబాబు తదితరులు పాల్గొన్నారు.



ఏపీ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కలిసిన తెలంగాణ టీడీపీ నేతలు నల్లెల కిషోర్, కె.కిరణ్‌కుమార్

ఏపీ మంత్రి సంధ్యారాణిని కలిసిన టీటీడీపీ నేతలు

నల్లకుంట, మే 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఏపీ కడపలో ఈనెల 27, 28, 29వ తేదీల్లో జరిగే మహానాడు నేపథ్యంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి నల్లెల కిషోర్, తెలంగాణ తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కె.కిరణ్‌కుమార్ ఏపీ రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా మహానాడులో తెలంగాణ నుంచి వచ్చే నాయకుల వసతుల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ తెలంగాణలో టీడీపీని బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రదీప్‌గౌడ్, శ్యామ్‌కుమార్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ ఎన్.రమేష్‌బాబుకు మాదాల స్మారక పురస్కారం ప్రదానం



రమేష్‌బాబుకు మాదాల స్మారక పురస్కారాన్ని అందజేస్తున్న విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ టి.గౌరీశంకర్ తదితరులు

రాంనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): నిస్వార్థ తత్వానికి, నిజాయితీకి దర్పణమైన మాదాల వీరభద్రరావు 2025 పురస్కారాన్ని సీనియర్ జర్నలిస్ట్ ఎన్.రమేష్‌బాబుకు అందజేశారు. ఈ కార్యక్రమం ఆదివారం చిక్కడపల్లిలోని శ్రీకృష్ణమందిరంలో జరిగింది. మాదాల వీరభద్రరావు స్మారక సమితి, సాధన సాహితీ స్రవంతి సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ టి.గౌరీశంకర్ ముఖ్యఅతిథిగా హాజరై ఎన్.రమేష్‌బాబుకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శంకరనారాయణ, సాధన నర్సింహాచార్య, మాదాల రాజేంద్రప్రసాద్, రఘుశ్రీ, రాయపోలు రమణ, కడియం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ పెంపును అమలు చేయాలి



మాట్లాడుతున్న స్టేట్ బ్యాంక్ అఖిల భారత విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అనంతకృష్ణ, ఈఎస్.ప్రసాద్ తదితరులు

రాంనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులకు 1995 నుంచి పెన్షన్ పెంపును వెంటనే అమలు చేయాలని స్టేట్ బ్యాంక్ అఖిల భారత విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అనంతకృష్ణ, సీఎస్.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో నాయకులు ఉప్పు సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. రిటైర్డ్ ఎస్‌బీఐ ఉద్యోగులందరికీ బీమా సౌకర్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రిటైర్డ్‌ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉప ప్రధానకార్యదర్శి కె.రోహిణిరావు, నాయకులు లక్ష్మారెడ్డి, కృష్ణమురళీ, ములినిరెడ్డి, రవికుమార్, రామకోటేశ్వర్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోనసీమ ద్రవిడ సంఘం నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులు

చిక్కడపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని కోనసీమ ద్రవిడ సంఘం నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు నూతన సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వడ్లమాని బాలామణి, కార్యదర్శిగా ఆదిభట్ల కామేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా బండి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోనసీమ ద్రావిడ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని వివరించారు.

యుగపురుషుడు ఎన్టీఆర్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

చిక్కడపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి హృదయాల్లో నటుడుగా చెరగని ముద్ర వేసిన ఎన్టీరామారావు యుగపురుషుడు అని సిటీ సివిల్‌కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పీవీపీ అంజనికుమారి అన్నారు. బాలాజి ఫౌండేషన్ ఆర్ట్స్ అండ్ గ్లోబల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగానసభలో ఎన్టీరామారావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన అంజనికుమారి గాయకుడు హనుమంతరావు(విజయనగరం)కు ఎన్టీఆర్ పురస్కారాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో అణుశాస్త్రవేత్త విశ్వనాథ్ మద్దిపట్ల, నిర్వాహకులు, గాయకులు రామోజీ, వెంకట్రావు, జగదీశ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అద్భుతంగా భరతనాట్య అరంగేట్రం



భరతనాట్యం ప్రదర్శించిన నాట్యకళాకారులతో అతిథులు

చిక్కడపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): సురభి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రముఖ భరతనాట్య గురువు వినీత శ్రీనందన్ శిష్యులు ధృతి సుహానీ, ఆరాధ, అద్వైత, కృషి భరతనాట్య అరంగేట్రం చేశారు. ఈ ప్రదర్శన ఆదివారం త్యాగరాయ గానసభలో అద్భుతంగా జరిగింది. గురువు వినీత, కృష్ణన్‌తో కలిసి నట్టువాంగం చేయగా సురేష్‌బాబు గాత్రసహకారం అందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వంశీ సంస్థల అధినేత వంశీరామరాజు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత గ్రామం పాల్వంచకు చెందిన నలుగురు బాలికలు భరతనాట్యంలో శిక్షణ పొంది తొలి ప్రదర్శనలోనే తమ ప్రతిభను ప్రదర్శించారని అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి అప్పికట్ల భరత్‌భూషణ్, పక్కన పల్లెల వీరస్వామి తదితరులు

ఎస్సీ వర్గీకరణ సమయంలోని కేసులను ఎత్తివేయాలి

రాంనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సమయంలో పోరాడిన మాల మహానాడు, మాదిగ దండోరా కార్యకర్తలపై పెట్టిన కేసులను తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఎత్తివేయాలని రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి అప్పికట్ల భరత్ భూషణ్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బంధు సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాల మహానాడు, మాదిగ దండోరా కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. అనంతరం ప్రొఫెసర్ ముత్తయ్య, ప్రొఫెసర్ నథానియేలు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల బ్యాక్‌లాగ్ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవానందం, కె.వెంకటేశ్వరరావు, పి.ఆంజనేయులు, ఎస్.నర్సింగ్‌రావు, వశపాక నర్సింహ తదితరులు పాల్గొన్నారు.